



ప్రజా ఉద్యమాలకు, చైతన్య పోరాటాలకు గుమ్మంగా నిలిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా.. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లోనూ కీలకంగా నిలిచింది. అస్తిత్వ ఉద్యమానికి ఊపిరి పోసిన నేలగా ప్రత్యేకమైన ఖ్యాతిని దక్కించుకుంది. తొలిదశ ఉద్యమంలో 'ఇడ్లీ, సాంబార్ గో బ్యాక్...' అంటూ చేసిన నినాదం తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోయగా, నిధులు, నీళ్లు, నియామకాల ఆకాంక్షలతో సాగిన మలిదశ ఉద్యమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కదం తొక్కింది. అన్నాబత్తుల రవీంద్రనాథ్, పోటు కృష్ణమూర్తి, కొలిశెట్టి రాందాస్, తిప్పన సిద్దులు వంటి తొలిదశ పోరాటయోధుల స్ఫూర్తితో మలిదశ ఉద్యమంలో తనదైన పాత్రను పోషించింది. ఎన్నో మెరుపులకు, మరకలకు వేదికగా నిలిచింది. కేసీఆర్‌ను అరెస్టు చేసి, ఖమ్మం జైలుకు తరలించినప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యమగానమై మార్మోగింది. సకల జనుల సమ్మెలో సబ్బండ వర్గాలు రోడ్డెక్కి తమ ఆకాంక్షను చాటిచెప్పాయి. ఆంధ్రాకు సరిహద్దున ఉన్నప్పటికీ తనదైన 'ప్రత్యేక' స్పృహతో తెలంగాణ సాధనోద్యమంలో ఖమ్మం జిల్లా కీలకపాత్ర పోషించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి జూన్ 2తో పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆనాటి మహోద్యమ ఘట్టాలను మననం చేసుకునే ప్రయత్నమిది...



తెలంగాణ ఉద్యమ గుమ్మం

తొలి, మలి దశ ప్రత్యేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా

- స్ఫూర్తినిచ్చిన అన్నాబత్తుల రవీంద్రనాథ్, పోటు కృష్ణమూర్తి, కొలిశెట్టి రాందాస్
- సమర కేతనమై కదంతొక్కిన సకల జనులు
- కేసీఆర్‌ను ఖమ్మం జైలుకు తరలించినప్పుడు మార్మోగిన ఉద్యమగానం
- తెలంగాణ ఏర్పాటయ్యే వరకు క్రియాశీలతను చాటిన సబ్బండ వర్గాలు
- తెలంగాణ రాష్ట్రావతరణ తర్వాత మారిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్వరూపం
- ఏపీలో 5 మండలాలు పూర్తిగా, రెండు పాక్షికంగా విలీనం
- రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా.. పూర్తిగా నెరవేరని ఆకాంక్షలు

తెలంగాణ రాష్ట్రానికి రేపటితో పదేళ్లు..

ఖమ్మం, మే 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఖమ్మం జిల్లా తనదైన పాత్రను పోషించింది. చైతన్యాల ఖిల్లాగా పేరుగాంచిన ఖమ్మం.. మలిదశ ఆరంభం నుంచి చివరివరకూ అడుగడుగునా తన క్రియాశీలతను చాటింది. ఎన్నో ఘట్టాలకు, పరిణామాలకు వేదికగా నిలిచింది. 2009లో కేసీఆర్ అరెస్టు, ఖమ్మం జైలుకు తరలింపు నేపథ్యంలో తెలంగాణ ఉద్యమం ఊపందుకోగా.. ఖమ్మం జిల్లా ప్రజలు అనేక రకాలుగా ఉద్యమంలో పాలుపంచుకొని బాసటగా నిలిచారు. అటు కేటీపీఎస్ కార్మికులు, సింగరేణి, ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు, అధికారులు మేము సైతం అంటూ ఉద్యమసారధులై సమైక్యంగా కదిలి వచ్చారు. పాల్వంచ కేటీపీఎస్ నిర్మాణదశలో ఉద్యోగ నియామకాల్లో ఆంధ్రా వారు అధికశాతం తీసుకుపోతుండడంతో 1969లో పాల్వంచలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం పురుడు పోసుకుంది. ఇడ్లీ, సాంబారు గోబ్యాక్ అంటూ ఆంధ్రా నుంచి వలసవచ్చిన వారికి వత్యిరేకంగా ఉద్యమం చేపట్టగా.. ఆ తర్వాత ఆ ఉద్యమం ఇల్లెందుకు వ్యాప్తి చెందింది. ఉస్మానియాలో చదివే తెలంగాణ విద్యార్థులకు సీట్లు రావడంలేదని ఖమ్మంలో అన్నాబత్తుల రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో 14 రోజులు చేసిన నిరాహారదీక్ష తెలంగాణ ప్రాంతంలో తొలి దశ ఉద్యమానికి బీజం వేసింది. సింగరేణి కార్మికులు, కేటీపీఎస్ కార్మికులు తమ ఉద్యోగాలు తమకు కావాలని చేసిన పోరాట ఫలితంగా స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చే 610జీవోకు బీజం పడింది. తొలి దశ ఉద్యమం ముగిసిన అనంతరం రాష్ట్రసాధన ఉద్యమం కొంత పక్కకు పోయినా మళ్లీ కేసీఆర్‌తో పాటు కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్, కోదండరామ్, గద్దర్ తదితరుల సారధ్యంలో ఉద్యమం ఊపిరి పోసుకుంది. నిధులు, నీళ్లు, నియామకాల ఆకాంక్షలతో మొదలైన మలి దశ రాష్ట్రసాధన ఉద్యమం అనతికాలంలోనే ప్రజల్లోకి వెళ్లింది. ఖమ్మంజిల్లాలో అన్ని రాజకీయపార్టీలు ప్రజాసంఘాలు, కార్మిక, విద్యార్థి, యువజన, మహిళ, ఉద్యోగ సంఘాలు జై తెలంగాణ నినాదం అందుకున్నాయి. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అన్న నినాదంతో 2009లో అప్పటి టీఆర్ఎస్ నేతగా ఉన్న కేసీఆర్ ఉద్యమాన్ని ఉధృతం చేసి కరీంనగర్‌లో అరెస్టయి ఖమ్మం రావడం, ఖమ్మం జైలులో ఉంచడం, జైలులో కూడా కేసీఆర్ దీక్ష చేపట్టడం, ఖమ్మం ఆసుపత్రికి తరలించినా.. దీక్ష కొనసాగించడం, ఖమ్మం ఆసుపత్రి వద్ద అప్పటి టీఆర్ఎస్‌తో పాటు సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ, సీపీఐ, పీడీఎస్‌యూ, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ అధికారులు అన్నివర్గాల ప్రజలు, తెలంగాణవాదులు పెద్దఎత్తున సంఘీభావం పలకడం ఆనాటి పోరాటంలో ముఖ్యఘట్టాలుగా నిలిచిపోయాయి.

రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్శిటీ విద్యార్థులు కదం తొక్కడంతో 2009 నవంబరు 29న అప్పటి హోంశాఖ మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలైందని ప్రకటన చేయగా, ఆ తర్వాత మళ్లీ అనేక అవరోధాలు ఏర్పడటంతో ఖమ్మం జిల్లా మళ్లీ ఉద్యమపథంలో కదం తొక్కింది. సకల జనుల సమ్మెలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, పార్టీల నాయకులు, (మిగతా 6వ పేజీలో)

రేపు 'తెలంగాణ' ఆవిర్భావ వేడుకలు

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్‌కాంతుల హంగులు 6



మంత్రి తుమ్మలను కలిసిన స్వామి నారాయణ పాఠశాల నిర్వాహకులు

'స్వామి నారాయణ'కు 15 ఎకరాలు

మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు

రఘునాథపాలెం, మే 31: రఘునాథపాలెంలో స్వామి నారాయణ పాఠశాలకు ప్రభుత్వం 15 ఎకరాలస్థలాన్ని కేటాయించింది. దీంతో శుక్రవారం స్వామి నారాయణ పాఠశాల నిర్వహణ కమిటీ బాధ్యులు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరితగతిన స్థలం కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి(సీబీఎస్ఈ) విద్యా బోధన అందించటం స్వామి నారాయణ పాఠశాలల లక్ష్యం. విద్యతో పాటు ఉన్నతమైన విలువలు, వ్యక్తిత్వ వికాసం, యోగా, క్రీడలు, జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాబోధనను అందించనున్నారు. ఇంగ్లీష్ మీడియంతో బాలురకు వసతి గృహంతో కూడిన గురుకుల విద్యను అందించనున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు

అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని అంకమ్మ చెరువు ఫ్లడ్ ఫ్లో కెనాల్ పనులను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి తుమ్మల తెలిపారు. అదేవిధంగా 2019లో తుఫాన్ వల్ల గండిపడిన చండ్రుగొండ మండలం సీతాయిగూడెంలోని వెంగళరాయ ప్రాజెక్టు చెరువు కట్టకు మరమ్మతులు పూర్తి చేసేందుకు నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరినట్టు తెలిపారు.



ఎండలు మండిపోతుండడంతో ముదిగొండలో చెట్టునీడన చేరిన గొర్రెలు

రారెత్తిస్తున్న ఎండలు

భద్రాద్రి కొత్తగూడెంలో 46.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఖమ్మం కార్పొరేషన్, మే 31: మళ్లీ అదే భానుడి భగభగ... ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గడం లేదు. శుక్రవారం ఖమ్మం జిల్లాలో 46.8డిగ్రీల సెల్సియస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 46.9డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గరిష్ఠంగా 47డిగ్రీలకు చేరువలో ఉండటం, కనిష్ఠంగా 28డిగ్రీలకు చేరుకోవటంతో వాతావరణంలో తీవ్ర వేడిమి ఉండి, నిప్పుల కొలిమిగా మారింది. ఎండల తీవ్రత కారణంగా పలువురు వడదెబ్బకు గురవుతున్నారు. వడగాల్పులు, ఎండ తీవ్రత, ఉక్కపోతతో వృద్ధులు చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు.

'జీలుగులు' జంప్..



- బంధువులు, స్నేహితుల పేరుతో ఏపీకి పంపుతున్న వైనం
- ఇక్కడ రూ.1,116కు కొనుగోలు చేసి.. అక్కడ రూ.2వేలకు విక్రయాలు
- స్థానిక రైతులకు కొరత ఏర్పడే ప్రమాదం

మధిర, మే 31: తెలంగాణ ప్రభుత్వం 60శాతం సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలకు ఏపీలో డిమాండ్ ఏర్పడింది. తెలంగాణలో రూ.1,116కు ఇస్తున్న విత్తనాల సంచి ఏపీలో రూ.2వేలకుపైగా డిమాండ్ పలుకుతోంది. ఏపీలో ప్రభుత్వం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయకపోవడంతో తెలంగాణలో సరఫరా అవుతున్న విత్తనాలను కొందరు బంధువులు, స్నేహితుల ద్వారా సంపాదించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

వ్యవసాయ సీజన్ ప్రారంభంలో మాగాణి పొలాలతోపాటు, మిర్చి తోటల్లో రైతులు ఎక్కువగా జీలుగ విత్తనాలనే చల్లుతుంటారు. గతంలో పెసర వేసేవారు. దీని ద్వారా నత్రజని మాత్రమే పొలానికి చేకూరుతుందని, అదే జీలుగులు చల్లితే భూమి సారవంతం కావడంతోపాటు, చౌడుతగ్గడం, కలుపులోనూ తగ్గుదల ఉంటుందని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. దీంతో రైతులు జీలుగులు విత్తనాలు చల్లుకోనేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. రైతుల డిమాండ్‌కు తగ్గట్టుగా ప్రభుత్వం వ్యవసాయ సీజన్‌కు ముందే రైతులుకు జీలుగులు, జనుములు ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తుంది.

తెలంగాణలో ప్రభుత్వం ఈ ఏడాది 28వ తేదీ నుంచి గ్రామాల వారీగా 60 శాతం సబ్సిడీపై రూ.2,790రూపాయల జీలుగులు విత్తనాలు రూ.1,116లుకు, రూ.3,620లున్న జనుములు రూ.1,448లుకు రైతులకు అందజేస్తోంది. పాస్‌పుస్తకం వున్న వారికి ఎకరం నుంచి రెండున్నర ఎకరాల వరకు 30కేజీల సంచి ఒకటి చొప్పున ఎన్ని ఎకరాలుంటే అన్ని విత్తన సంచులు ఇస్తున్నారు. ఇదే సమయంలో ఏపీలోని రైతులకు అక్కడి ప్రభుత్వం ఇంకా జీలుగులు ఇవ్వకపోవడంతో ఏపీ రైతులు తెలంగాణ విత్తనాలకోసం పరుగులు తీస్తున్నారు. రైతుల్లో ఏర్పడిన డిమాండ్‌తో కొందరు తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో సుబాబుల్, జామాయిల్ సాగుచేస్తున్న రైతుల ద్వారా ఎంతో కొంత ఇచ్చి జీలుగు విత్తనాలు సేకరించి ఆంధ్రాలోని రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. దీంతో విత్తనాలు ప్రారంభించిన (28వతేదీనుంచి) రెండు రోజుల్లోనే అన్ని సొసైటీల్లో అయిపోయాయి.

65శాతం విత్తనాలు మాత్రమే సరఫరా...

ప్రభుత్వం వ్యవసాయశాఖ గతేడాది అమ్మకాలను బేరీజు వేసుకొని పెట్టిన డిమాండ్‌లో ఇప్పటివరకు 65 శాతం మాత్రమే సరఫరా చేశారు. మిగిలినవి త్వరలో వస్తాయని అధికారులు తెలుపుతున్నారు. మధిర డివిజన్‌లో వ్యవసాయశాఖ జీలుగులుకు 4,550 క్వింటాళ్లు డిమాండ్ పంపితే ఇప్పటివరకు 3,079 క్వింటాళ్లు సొసైటీల ద్వారా సరఫరా చేశారు. ఇంకా 1,470 క్వింటాళ్లు రావాల్సి వుంది. వచ్చిన వాటిలో ఇప్పటికే 2,100 క్వింటాళ్లకు పైగా అమ్మకాలు జరిగాయి. ఏపీ సరిహద్దు సొసైటీల్లో పూర్తిగా అమ్మకాలు జరిగినట్లు తెలుస్తుంది. అదే జనుములుకు 430 క్వింటాళ్లకు డిమాండ్ పంపగా 360 క్వింటాళ్లు వచ్చాయి. ఇంకా 70 క్వింటాళ్లు రావాల్సివుంది. ఇప్పటివరకు 226 క్వింటాళ్లు అమ్మకాలు జరిగాయి. మిగిలినవికూడా త్వరలోనే వస్తాయని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. ఏపీకి విత్తనాలు తరలిపోతుండటంపై మధిర మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా అలాంటిదేమీలేదని పాస్‌పుస్తకం వున్న రైతులకు మాత్రమే విత్తనాలు ఇస్తున్నామని వారి బంధువులు ఎవరికైనా.. ఇచ్చివుంటే తమకు తెలియదని తెలిపారు.



అభివృద్ధిని చేతల్లో చూపిస్తా..

- జీవితాంతం పాలేరు ప్రజలకు సేవ చేస్తా..
- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..
- ఎన్నికల కోడ్ తర్వాత అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, మే 31: గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గ ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుని ఆదరించి గెలిపించారని, మీ దీవెనలతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యాయని, ఈ ప్రాంత ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ముందుండి వాటిని పరిష్కరిస్తానని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాలపురం, తిమ్మక్కపేట, బీరోలు, బచ్చోడుతండా, రాజారం, పైనంపల్లి, సోలిపురం, కాకరవాయి, ముజాహిద్‌పురం, రఘునాథపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో ముఖాముఖి చేపట్టి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లస్థలాలు పింఛన్లు, పక్కా గృహాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క రేషన్‌కార్డు కూడా రాలేదని, ఇళ్లస్థలాలు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి జరగలేదని, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇళ్లస్థలాలు, పక్కా గృహాలు లేవని ప్రజలు తమ దృష్టికి తెస్తున్నారని, అందరికి ఎన్నికల కోడ్ అనంతరం సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు.

పాలేరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి సాగు, తాగునీటితోపాటు విద్య, వైద్యం రహదారులు, సీసీ రోడ్లు మంజూరు చేస్తానన్నారు. రానున్న మూడేళ్లలో ప్రతి గ్రామంలో సమస్యలు లేకుండా చూస్తానని తెలిపారు. ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌లో నీళ్ల లేకపోయినా.. సాగునీటి కొరత ఉన్నా.. పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఆగస్టు 15న నాటికి రైతు రుణమాఫీ చేస్తున్నట్టు తెలిపారు.

గొర్రెల కాపరులకు ఆర్థికసాయం

మండలంలోని రాజారం గ్రామంలో గొర్రెల కాపరులకు మంత్రి పొంగులేటి రూ.2లక్షల10వేలు ఆర్థికసాయం అందించారు. రాజారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులుకు చెందిన గొర్రెలు విషపూరితమైన గడ్డి తిని సుమారు 200గొర్రెలు మృత్యువాతపడ్డాయి కాగా వారికి తనవంతు సాయంగా పొంగులేటి ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వ పరంగా కూడా ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోడ మంగీలాల్, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, జడ్పీటీసీ బెల్లం శ్రీను, చావా వెంకటేశ్వరరావు, కర్నాటి శ్రీను, నల్లమల ప్రసాద్, మక్తాల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ బుద్ద వంశీకృష్ణ, వనవాసం నరేందర్‌రెడ్డి, చాగంటి వెంకన్న, ఓర వెంకటేశ్వర్లు, సంద్ర వెంకన్న, నల్లమల కిరణ్, బుద్ధ కనకయ్య పాల్గొన్నారు.

నేటి పర్యటన వివరాలు

ఖమ్మం రూరల్: మండలంలో శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని సత్యనారాయణపురం, ఏదులాపురం, గొల్లగూడెం, బారుగూడెం, ఆరెంపుల, పొన్నేకల్లు, మద్దులపల్లి, తెల్దారుపల్లి, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల, నంద్యాతండా, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్‌గృహకల్ప ప్రాంతాల్లో పర్యటిస్తారని తెలిపారు.

సకల వసతులతో వైద్య కళాశాల


- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణం జరగాలి
- వైద్య విద్య డైరెక్టర్ డాక్టర్ వాణి
- కలెక్టర్ వీపీ గౌతమ్‌తో భేటీ



కళాశాల స్థలం, నిర్మాణాలపై కలెక్టర్ వీపీ గౌతమ్‌తో వైద్య విద్య డైరెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మే 31: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య విద్యా సంచాలకులు ఎన్.వాణితో కలిసి ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాల శాశ్వత భవనాలకు ఖమ్మంఅర్బన్ మండలం బల్లెపల్లి, రఘునాథపాలెం గ్రామాల్లో సుమారు 43 ఎకరాల స్థలం గుర్తించామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. నిర్మాణ ప్లాన్‌లో కళాశాల భవనాలు, విద్యార్థుల హాస్టల్ భవనాలు, అధ్యాపకుల క్వార్టర్స్ నిర్మాణం, ప్రధాన రహదారికి ఎదురుగా కళాశాల ముఖద్వారం బాగా కనిపించే ఉండేట్టు ప్రణాళిక చేస్తున్నట్టు తెలిపారు. స్థల సమస్య లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో అదనపు వైద్య విద్య సంచాలకులు విమల థామస్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ బి.కిరణ్ కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్యామ్ ప్రసాద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్‌గోపాల్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు ఉన్నారు.

అంతకు ముందు ఆమె కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్‌తో కలిసి రఘునాథపాలెం సమీపంలో మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలం దానికి హద్దులు, ఎక్కడెక్కడ భవనాలు ఉండాలి, ప్రధాన ద్వారం ఉండే ప్రాంతాలను పరిశీలించారు. తొలుత కళాశాలకు వచ్చిన ఆమెకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు వివిధ విభాగాల అధిపతులు డీఎంఈ వాణికి ఘనంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఉన్నారు.



నేడు హనుమజ్జయంతి

ఆలయాల్లో పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఖమ్మం సాంస్కృతికం, మే 31: హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఖమ్మం నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా గల ఆంజనేయ, సీతారామాంజనేయ ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. నగరంలోని కాల్వొడ్డు ఆంజనేయస్వామి ఆలయం, చెరువు బజార్ దాసాంజనేయ స్వామి దేవాలయం, పర్ణశాల సీతారామాంజనేయస్వామి తదితర ఆంజనేయస్వామి దేవాలయాల్లో శుక్రవారం నుంచే ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. పంచామృత, అష్టోత్తర శతకలశాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. హనుమత్ జయంతి సందర్భంగా శనివారం హోమాలు, తమలపాకు పూజలు, తదితర అభిషేకాలు నిర్వహించనున్నారు.

రూ.11లక్షలతో గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం

» భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, మే 31: రహదారి సౌకర్యం లేని దట్టమైన అటవీ ప్రాంతమైన అశ్వారావుపేట మండలం వాగోడ్డు గూడెం, నారాయణపురం గ్రామాల్లో గిరిజన కుటుంబాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించినట్టు భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం వాగోడ్డుగూడెం, నారాయణపురం గ్రామాలకు చెందిన గిరిజన కుటుంబాల వారు పీవోను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చారు. పీవో మాట్లాడుతూ అనేక ఏళ్లుగా గిరిజనులు పడుతున్న అవస్థలను చూసి అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకొని విద్యుత్తు సౌకర్యం కల్పించామన్నారు. గతంలో ఆ గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం లేక, గిరిజనులు కొంత డబ్బు చెల్లించినా ఫారెస్టు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో విద్యుత్తు సౌకర్యం కల్పించలేదని అన్నారు. గ్రామాలకు కరెంటు పోల్, ప్రతి ఇంటికి కరెంటు మీటరుతో పాటు నయా పైసా ఖర్చు కాకుండా ప్రతి కుటుంబానికి విద్యుత్తు సౌకర్యం కల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పవర్ మునీర్‌పాషా, గిరిజనులు పాల్గొన్నారు.



గిరిజనులతో పీవో ప్రతీక్‌జైన్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

» ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 31: 2024-25 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న తరుణంలో ఉపాధ్యాయులంతా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల ను మరింత బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఓ ఫక్షన్ హాల్‌లో సంఘం ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను, తల్లిదండ్రులను ఇంటింటికి వెళ్ళి కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని అన్నారు. జూన్ రెండో వారంలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు షెడ్యూల్ విడుదల కానున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు మోతుకూరి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు, నాయకులు శేఖర్, సు.ఆత, విజయ్ అమృత్ తదితరులు పాలొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

తెలంగాణ ఉద్యమ గుమ్మం

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తలు ఉద్యమించడంతో ఉద్యమం తారాస్థాయికి చేరింది. అనంతరం పలు పరిణామాల నేపథ్యంలో 2014 జూన్ 2న పార్లమెంట్ బిల్లుతో తెలంగాణ రాష్ట్ర ఏర్పడింది.

నిధులు, నీళ్లు, నియామకాల నినాదంతో మలిదశ ఉద్యమం ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో గడిచిన దశాబ్దకాలం, ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినప్పటికీ అభివృద్ధిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతి సాధించినా, పూర్తి లక్ష్యాల సాధనలో కొన్నింటిలో ఇంకా వెనుకబడే ఉంది. పరిపాలన సౌలభ్యం కోసం ఉమ్మడిజిల్లా రెండుగా చీలి కొత్తగూడెం కేంద్రంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పాటైంది. అయితే రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 46మండలాలు ఉండగా పోలవరం ముంపు కారణంగా చింతూరు, వీఆర్ పురం, కూనవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతోపాటు భద్రాచలం పట్టణం మినహా మిగిలిన 20పంచాయతీలు, బూర్గంపాడు మండలంలో కొన్ని పంచాయతీలు ఏపీలో విలీనమయ్యాయి. 2016లో జిల్లాల పునర్విభజనలో గార్ల, బయ్యారం మండలాలు మహబూబాబాద్ జిల్లాలో, వెంకటాపురం, వాజేడు మండలాలు ములుగు జిల్లాలో కలిశాయి. దీంతో ఉమ్మడి ఖమ్మంజిల్లా స్వరూపం పూర్తిగా మారిపోయింది.

సీతారామ... బయ్యారం ఉక్కుపరిశ్రమ...

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఖమ్మంజిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపుతోపాటు పరిపాలన పరంగా అభివృద్ధి కొంత పరుగులు తీసింది. అయితే సీతారామ వంటి కీలక ప్రాజెక్టులో జాప్యం జరుగుతోంది. విభజన చట్టంలోని ఉక్కుపరిశ్రమ అమలుకు నోచుకోలేదు. విద్యా, వైద్యం నీటిపారుదలతోపాటు విద్యుత్, తాగునీరు, రహదారుల తదితర రంగాలలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. గడిచిన పదేళ్లలో రూ.50వేలకోట్లకుపైగా నిధుల కేటాయింపు జరిగినా పనులు పూర్తికాని పరిస్థితి.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ కేబినేట్‌లో తొలిమంత్రిగా రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టించారు. ఆయన హయాంలోనే సీతారామ ప్రాజెక్టు మంజూరు, భక్తరామదాసు ప్రాజెక్టు నిర్మాణం, భద్రాద్రి పవర్‌ప్రాజెక్టు, కేటీపీఎస్ విస్తరణ, బుగ్గపాడు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి వంటి పనులకు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారులు ప్రస్తుతం పూర్తిదశలో ఉన్నాయి. మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ పనులు పూర్తికాగా.. సీతారామ ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరుగుతోంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లా నుంచి రెండో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రవాణశాఖ మంత్రిగా గడిచిన ఐదేళ్లు పనిచేశారు. గత ఎన్నికల్లో జిల్లా నుంచి పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవడం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు బాధ్యతలు చేపట్టారు. ముగ్గురు నేతలు జిల్లా అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు.

రాబోయే ఐదేళ్ల కాలంలో జిల్లా అభివృద్ధి సాధించాంటే జిల్లాలో యూనివర్శిటీ ఏర్పాటు, వ్యవసాయాధారిత పరిశ్రమలు, సీతారామ సాగునీటి ప్రాజెక్టు పూర్తితోపాటు గోదావరి, కృష్ణా జలాలతో కృష్ణా ఆయకట్టు పాలేరు అనుసంధానం వంటి పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. రైల్వే లైన్లు, ఎయిర్‌పోర్టు ఏర్పాటు ఇతర సదుపాయాలు సమకూర్చడం ద్వారా జిల్లా అభివృద్ధి కొత్త పుంతలు తొక్కనుంది. అలాగే భద్రాచలం, జమలాపురం ఆలయాల అభివృద్ధి, పర్యాటక సొగసుల కల్పన, భద్రాచలం వద్ద ఐదు పంచాయతీలు తిరిగి తెలంగాణలో విలీనం, పాలేరు నుంచి పర్ణశాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

రేపు 'తెలంగాణ' ఆవిర్భావ వేడుకలు

» ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ కాంతుల హంగులు

ఖమ్మం కలెక్టరేట్, మే 31: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జిల్లా ముస్తాబవుతోంది. జూన్ 2న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం విద్యుత్ కాంతులతో విరాజిల్లుతోంది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొననున్నారు. మయూరిసెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం 8:30కి బైపాస్‌రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. 9 గంటలకు ఐడీఓసీలో జాతీయజెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పదేళ్ల జిల్లా ప్రగతిపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సాయం త్రం లకారం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కాగా, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను, నగరంలోని ప్రధాన సెంటర్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



విద్యుత్ కాంతులతో ఖమ్మం జడ్పీ కార్యాలయం

రామయ్య సన్నిధికి హనుమాన్ దీక్షాపరులు

» దీక్ష విరమణ కోసం దక్షిణ అయోధ్యకు రాక

» దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

» లక్షన్నర లడ్డూలు సిద్ధం చేశామంటున్న అధికారు

భద్రాచలం, మే 31: హనుమజ్జయంతిని పురస్కరించుకొని దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామయ్య సన్నిధికి హనుమాన్‌దీక్షితులు వస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నల్గొండ తదితర జిల్లాల నుంచి వేల సంఖ్యలో హనుమాన్ దీక్షితులు భద్రుని కొండకు తరలివస్తున్నారు. శనివారం హనుమజ్జయంతి కావడంతో హనుమాన్ దీక్షాపరులు భద్రాద్రి రామయ్య సన్నిధిలో దీక్ష విరమణ చేయనున్నారు. దీంతో హనుమాన్ దీక్షితుల కోసం భద్రాద్రి దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంటోంది. అలాగే లక్షన్నర లడ్డూలను దీక్షితులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాగ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి వారికి ప్రత్యేక స్నపనం, తమలపాకుల పూజ, ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమాన్ దీక్షాపరుల రాకతో పట్టణంలోని దేవస్థానంలోని సత్రాలు, కాటేజీలు, రామాలయ పరిసరాలు హనుమాన్ దీక్షితులతో కిటకిటలాడుతున్నాయి.



క్యూలైన్లలో స్వామి వారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

నిబద్ధత గల వ్యక్తి అప్పారావు



అప్పారావు దంపతులను సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 31: ఆర్టీసీ సంస్థలో 37 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసి నిబద్ధతను సాటుకున్న వ్యక్తి జట్ల అప్పారావు అని ఆర్టీసీ అకౌంట్స్ అధికారి బాలస్వామి అన్నారు. శుక్రవారం ఖమ్మం ఆర్టీసీ డిపో పరిధిలో సినియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన అప్పారావు దంపతులను ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్ ఆవరణలోని అకౌంట్స్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు అప్పారావు సేవలను కొనియాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమ అన్నారు. ఉద్యో విరమణ పొందిన అప్పారావును కుమారుడు శ్రీకాంత్, కోడలు శ్రీ అపర్ణ, కూతురు శ్రీదేవి, అల్లుడు రాకేష్, మనుమరాల్లు శ్రీదన్వి, చాత్ర, శ్రీ నిఖలు శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయితీ ముగిసింది!

» దేవస్థానం, గ్రామ పంచాయతీల మధ్య సమస్య పరిష్కారం

భద్రాచలం, మే 31: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, గ్రామ పంచాయతీల మధ్య నెలకొన్న పంచాయితీ పరిష్కారమైందని సమాచారం. ఇటీవల ఈ రెండు శాఖల మధ్య సమన్వయం కొరవడినట్లు ప్రచారం సాగింది. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం మాడ వీధుల్లో పారిశుధ్య చర్యలు దేవస్థానమే నిర్వహించుకోవాలని లేఖను పంచాయతీ అధికారులు దేవస్థానానికి రాశారు. ఈ లేఖలో దేవస్థానం నుంచి పొల్యూషన్ కంట్రోల్‌బోర్డుకు డంపింగ్ యార్డు పొగ సమస్యను సైతం ప్రస్తావించారు. అంతకు ముందు ఆశీలు సిబ్బంది భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్న క్రమంలో ఆలయ ప్రాంగణంలో ఎటువంటి ఆశీలు వసూళ్లు చేపట్టవద్దని ఉత్తరద్వారం వైపు వాహనాల పార్కింగ్ ఉచితమని దేవస్థానం అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో అటు గ్రామ పంచాయతీ, ఇటు దేవస్థానం అధికారుల మధ్య ఓ కీలక అధికారి సమన్వయం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు యధావిధిగా సాగనుండగా దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పార్కింగ్ బోర్డులను తొలగించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచ, మే 31: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంఘటన పాల్వంచ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కొందరు యువకులు ఊరి శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిలో ఇద్దరు నిందితులను పట్టుకోగా ఐదుగురు పరారయ్యారు. పట్టుబడిన నిందితుల నుంచి రూ.3800 నగదును, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

గంజాయి సేవిస్తున్న యువకులకు రిమాండ్

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 31: విద్యాభ్యాసం కోసం ఇతర ప్రాంతాల నుంచి ఖమ్మం జిల్లా కేంద్రానికి వచ్చి చెడు వ్యసనాలకు బానిసలై గంజాయి సేవిస్తున్న యువకులను ఖమ్మం 1 ఎక్సైజ్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బీ కృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వారం రోజుల క్రితం రాజమండ్రి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఖమ్మం రైల్వేస్టేషన్‌లో పలు ప్రాంతాలకు చెందిన వారికి గంజాయిని విక్రయిం చి వెళ్లి పోయాడు. తర్వాత విషయం తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టి శుక్రవారం దాడులు నిర్వహించారు. దీంతో ఖమ్మం శివారులోని వైఎస్ఆర్ నగర్ ఎన్ఎస్‌పీ కాల్వ వద్ద గంజాయి సేవిస్తున్న యువకులు గుత్తికొండ యశ్వంత్, చింతి నేని విజేంద్రప్రసాద్, షేక్ ఆమీర్, తేజావత్ నితిన్ ముఠా పట్టుకొని రిమాండ్ చేశారు. వీరి వద్ద నుంచి 460 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నా రు. దాడుల్లో ఎస్ఐలు జయశ్రీ, సాయిబాబా, సిబ్బంది రామారావు, లలిత, శశికాంత్, రమేశ్, రమాదేవి, రాధాకృష్ణ, రాము, శ్రీలత పాల్గొన్నారు.

డీసీఎం బోల్తా: ఒకరి దుర్మరణం

నేలకొండపల్లి, మే 31: మండల పరిధిలోని గువ్వలగూడెంగ్రామం వద్ద శుక్రవారం తెల్లవారుఝామున రాజమండ్రి నుంచి మిర్యాలగూడెం వైపు పనసకాయల లోడుతో వెళ్తున్న టీఎస్05యూఎఫ్3053 నెంబరు కల ట్రాలీ బోల్తా పడింది. అతి వేగంగా వెళ్తున్న వాహనం గువ్వలగూడెం వద్ద మూడు పల్టీలు కొట్టింది. దీంతో ట్రాలీపై కూర్చున్న మిర్యాలగూడేనికి చెందిన దొండా నాగరాజుకు తీవ్రగాయాలైనాయి. అతనితో పాటు మరో వ్యక్తి ప్రభాకర్‌కు గాయాలు కాగా ఇరువురిని 108లో ఖమ్మం ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. నాగరాజు(38) పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతదేహం వెంట అంబులెన్స్‌లో వచ్చిన షేక్.ఖాసీం నేలకొండపల్లిలో వాంతులు చేసుకోవటంతో, ఖాసీంను 108లో ఖమ్మం తరలించారు. కాగా మృతునికి భార్య, ఇరువురు కుమారులున్నారు. నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన నాగరాజు

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

చింతకాని, మే 31: గుర్తు తెలియని రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చింతకాని, పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య కేఎం నెం 497 వద్ద చోటు చేసుకుంది. ఖమ్మం వైపు వెళ్లే రైలు నుంచి జారీ పడి మృతి చెందాడని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, మృతునికి 38 సంవత్సరాల వయసు, 5.6 అంగుళాల ఎత్తు, తెల్లని చొక్కాపై ఎరుపు, నలుపు రంగు గీతలు, నల్లని ఫ్యాంటు ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. అన్నం సేవా సమితి బాధ్యులు అన్నం శ్రీనివాసరావు బృందం సహాయంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకు తరలించినట్లు ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించినవారు 8712658589, 9493218856 నెంబర్‌లకు ఫోన్ చేయాలన్నారు.

రైలు పట్టాలు దాటుతూ వ్యక్తి ..

ఖమ్మంక్రైం, మే 31: రైలు పట్టాలు దాటుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం ఉదయం ఖమ్మం నగరంలో జరిగింది. రైల్వే పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి ఖమ్మం నుంచి మల్లెమడుగు వెళ్తున్న పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. ఈప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన రైల్వే పోలీసులు సంఘటనాస్థలంకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అన్నం శ్రీనివాసరా వుకు సమాచారం అందించారు. దీంతో అన్నం శ్రీనివాసరావు బృందం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

సీతారామ కెనాల్‌లో పడి వృద్ధురాలు..

అశ్వాపురం మే 31: మండల పరిధిలోని ఆమెర్దా కాలనీకి చెందిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు సమీపంలోని సీతారామా కెనాల్‌లో పడి మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. అమెర్దా కాలనీకి చెందిన షేక్ ఖాద్రి (80) అనే వృద్ధురాలు గురువారం కాలనీలోని తనకూతురు ఇంటినుంచి అమెర్దా వెళుతోంది. ఖాద్రి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవటంతో దారి తప్పి కాల్వలో పడిపోయినట్లు సమాచారం. ఎవరూ గమనించకపోవటంతో శుక్రవారం ఖాద్రి మృతదేహం లభ్యమయ్యింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధిక లోడ్‌తో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

భద్రాచలం, మే 31: గత కొద్ది రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతున్న క్రమంలో ఏసీలు, కూలర్ల వాడకం పెరగడంతో ట్రాన్స్‌ఫార్లపై ఆ ప్రభావం పడుతోంది. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి భద్రాచలంలోని శాంతినగర్ కాలనీలో ఓవర్ లోడు పడటంతో పక్కపక్కనే ఉన్న రెండు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఒక్కసారిగా మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి. దీంతో సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం యుద్ధ ప్రాతిపదికన 63 కేవీఏ విద్యుతు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి కాలనీకి తాత్కాలిక విద్యుత్తును పునరుద్ధరించారు. అనంతరం పూర్తిగా దగ్ధమైన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది అమర్చారు. అనంతరం తెల్లవారుజామున 3.30కి కాలనీలో పూర్తిస్థాయి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

తీర్థయాత్రలకు వచ్చి వడదెబ్బతో మృతి

● మృతురాలు ఒంగోలు జిల్లా చీమకుర్తి వాసి

మణుగూరు, మే 31: తీర్థయాత్రలకు వచ్చి మల్లూరు నర్సింహాస్వామి ఆలయానికి చేరుకున్న ఆ మహిళను వడదెబ్బ రూపంలో మృత్యువు కబలించింది. మృతురాలి కుమారుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు జిల్లా చీమకుర్తి గ్రామానికి చెందిన సిద్దా సీతాలక్ష్మి (61) తీర్ద విహార యాత్రల్లో భాగంగా శుక్రవారం భద్రాచలం రామాలయం చేరుకున్నారు. దర్శనం అనంతరం మంగపేట సమీపంలోని మల్లూరు నర్సింహాస్వామి ఆలయానికి చేరుకున్నారు. అస్వస్థతతో ఉన్న తల్లికి ఓఆర్ఎస్ ఇచ్చి దేవుని దర్శనానికి వెళ్లారు. దర్శన అనంతరం గుడి కిందకు దిగారు. అప్పటికే అపస్మారక స్థితంతో ఉన్న తల్లిని మణుగూరు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతిచెందినట్టు తెలిపారు. తీర్థ విహార యాత్రల కొసం బంధువులతో వచ్చిన ఆకుటుంబానికి తీరని విషాదం మిగిలింది. మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని ఉంచారు.

ఎండ వేడిమి తాళలేక యాచకుడు..

భద్రాచలం, మే 31: భద్రాచలంలోని సాయిబాబా ఆలయం వద్ద బిక్షాటన చేసే యాచకుడు సుబ్బారావు(65) ఎండ వేడిమి తాళలేక శుక్రవారం మృతి చెందారు. రెండు దశాబ్దాలుగా బిక్షాటన చేస్తూ జీవిస్తున్న ఆయన గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో తీవ్ర ఉక్కపోతకు గురై మృతి చెందినట్లు తెలుస్తోంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఎర్రుపాలెం మే 31: మండలంలోని ఎర్రుపాలెం గ్రామం రెమిడిచర్ల రోడ్డులో గల వైన్‌షాప్ సమీపంలో ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, జయంతి గ్రామానికి చెందిన పడిగేల శ్రీనివాసరావు (50) అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు అదే గ్రామనికి చెందిన భీమిరెడ్డి నరేంద్రరెడ్డి, గజ్జం వెంకటరెడ్డితో కలిసి వైన్‌షాపులో మద్యం తాగి, మద్యం ఎక్కువై సమీపంలో చెట్టువద్ద విశ్రాంతి తీసుకొని నిద్రలేచి చూడగా శ్రీనివాసరావు మృతిచెందిఉన్నాడు. మద్యం మత్తులో నరేందర్‌రెడ్డి, వెంకటరెడ్డిలే హత్యచేసి ఉంటారని మృతుని కొడుకు అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ మే 31: కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్లో బీటెక్ విద్యార్థి ఎల్లబోయిన గుణదీప్ హత్య కేసులో నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ షేక్ అబ్దుల్ రహమాన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇరవై ఐదు రోజుల క్రితం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి చెరుకురసం బండి వద్ద కొంతమంది యువకుల మధ్య గొడవ జరిగింది. బండియజమాని 100కు ఫోన్‌చేసి విషయం తెలిపాడు. వీరిలో మోహన్ అనే వ్యక్తి వల్లనే నిందితుడు తమ్మిశెట్టి కోటేశ్వరావుకు ఇలా జరిగిందని మనసులో పెట్టుకున్నాడు. ఈ విషయం త్రీటౌన్ స్టేషన్‌కు చేరగా వాళ్ల బయట మాట్లాడుకొని రాజీపడ్డారు. గురువారం మధ్యాహ్నం పట్టణంలోని ఓ బార్‌లో గంగాధర్ మృతుడు ఎల్లబోయిన గుణదీప్ మద్యం సేవిస్తుంటారు. నిందితుడు కోటేశ్వరావు, నాని అనే మరో వ్యక్తి కలిసి అదే బార్‌లో మద్యం సేవిస్తుంటారు. ఈ క్రమంలో గుణదీప్‌ను మోహన్ అనుకొని ఆ రోజు చెరుకు రసం బండివద్ద జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. మరోచోట మద్యం తాగుదామని గుణదీప్‌ను నమ్మించి తన స్కూటీపై కోటేశ్వరావు పోస్టాఫీస్ సెంటర్‌కు చేరుకున్నాడు. అక్కడ మాట్లాడుకుంటూ గొడవపడి విచక్షణారహితంగా గుణదీప్‌పై దాడి చేశాడు. ఈ క్రమంలో స్పృహతప్పి కిందపడిపోయిన గుణదీప్‌పై కాళ్లతో, చేతులతో మరోమారు తీవ్రంగా దాడిచేసి పారిపోయాడు. ఒకరిపై కోపంతో మరో యువకుడు గుణదీప్‌పై దాడి చేశాడు. మృతుడి పెదనాన్న రాజేశ్వరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధారాలు సేకరించిన పోలీసులు ఇరవైనాల్గు గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు ఏసీ మెకానిక్ వృత్తిగా కొనసాగుతున్నాడు. రౌడీయిజం, అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేదిలేదన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

» నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బూర్గంపాడు, మే 31: బూర్గంపాడు మండల పరిదిలోని కిన్నెరసాని, గోదావరి నదుల నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. మండల పరిదిలో జరుగుతున్న అక్రమ ఇసుక దందాపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అడ్డదారిలో ఇసుక దందా..!'అనే కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ ముజాహిద్ ఆదేశాల మేరకు ఆర్ఐ నరసింహారావు సిబ్బంది కలిసి బూర్గంపాడు మండల పరిదిలోని సారపాక, తాళ్లగొమ్మూరు, బూర్గంపాడు, బుడ్డగూడెం, పినపాక, ఉప్పుసాక గ్రామాలలో అక్రమ రవాణాకు పాల్పడకుండా ఎక్సకవేటర్ సహాయంతో కందకాలు తీయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని, వారి వాహనాలను స్వాదీనం చేసుకుని కార్యలయానికి తరలిస్తామన్నారు. తీసిన కందకాలను పూడ్చి అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా కఠినచర్యలు తప్పవని కేసులు నమోదు హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఆదికారులు ఇప్పటికే గ్రామాలలో ఉన్న అక్రమార్కుల ఇసుక నిల్వలను గుర్తించి వాటిని సీజ్ చేసి అభివృద్ధి పనులకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.




గొమ్మూరు వద్ద కందకాలు తీయిస్తున్న రెవెన్యూ ఆధికారులు

డ్రెయినేజీ కాలువలోకి రెస్టారెంట్లలోని ఆహార వ్యర్థాలు..

» జరిమానాలు విధించిన నగరపాలకసంస్థ అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, మే 31: ఖమ్మం నగరంలోని రెండు రెస్టారెంట్లు మిగిలిపోయిన ఆహార పదార్థాలు డ్రెయినేజీ కాలువల్లో వేస్తుండగా నగరపాలకసంస్థ అధికారులు ఆయా రెస్టారెంట్ల యజమానులకు శుక్రవారం జరిమానాలు విధించారు. నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్ల యాజమాన్యాలు మిగిలిపోయిన ఆహార పదార్థాలు డ్రెయినేజీల్లో పడేయటం వల్ల సదరు కాలువలు వ్యర్థాలతో నిండి పూడుకుపోతున్నాయి. దీంతో నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి పర్యవేక్షణ చేయాలని ఆదేశించటంతో సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, నగరపాలకసంస్థ అధికారులతో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రెండు రెస్టారెంట్లకు సంబంధించిన ఆహార వ్యర్థాలను కాలువల్లో పడేస్తుండగా, వారికి రూ.10వేలు, రూ.3వేల వంతున జరిమానాలు విధించారు. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహారపదార్థాలు మిగిలిపోతే వాటిని నగరపాలకసంస్థ సిబ్బందికి ఇవ్వాలని పేర్కొన్నా రు. కాగా హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఎక్కడ పడేస్తున్నారో ప్రతిరోజు పరిశీలించాలని పారిశుధ్య విభాగం శానిటరీ ఇన్స్‌పెక్టర్లను కమిషనర్ ఆదేశించారు. డ్రెయినేజీ కాలువల్లో పడేసిన వారికి భారీగా జరిమానాలు విధించాలన్నారు.



జరిమానా విధిస్తున్న నగరపాలక అధికారులు

కుమారుడు దాడి చేశాడని తండ్రి ఫిర్యాదు

కొణిజర్ల, మే 31: తన భూమిని సాగు చేసుకుంటూ ఒక్కరూపాయి కూడ ఇవ్వటంలేదని అడిగితే దాడి చేస్తున్నాడని పేర్కొంటూ శుక్రవారం మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాలె సరవయ్య తన కుమారుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం సరవయ్య తనకున్న ఐదెకరాల భూమిని కుమారుడైన రమేష్ సాగు చేసుకుంటున్నాడని, ఎటువంటి కౌలుడబ్బులు కూడ ఇవ్వటంలేదని దాంతో భూమిని వేరే వారికి కౌలుకు ఇస్తున్నానని చెప్పటంతో తండ్రి కొడుమ మధ్య గొడవ జరిగింది. దాంతో పాటుగా సరవయ్యకు అతని భార్య మధ్య ఘర్షణ జరుగుతుండటంతో కొడుకు, కోడలు, మనవడు వచ్చి తనపై దాడి చేశారని తప్పించుకున్నానని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయంపై ఎస్ఐ శంకర్‌రావును అడగగా కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

కొడుకు, కోడలు దాడి చేశారని తల్లి..

ఇల్లెందుటౌన్, మే 31: అత్తపై కొడుకు, కోడలు దాడి చేసిన సంఘటన ఇల్లెందు పట్టణంలోని కాకతీయనగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఈసం భద్రమ్మ అనే వృద్ధురాలిపై ఆమె కూమారుడు ఈసం వెంకటేశ్వర్లు అతని భార్య దాడి చేయడంతో ఇంట్లో ఉన్న టీవీ, ఇతర వస్తువులు ధ్వంసం చేశారని ఇల్లెందు పోలీసులకు భద్రమ్మ ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. తన కుమారుడు వెంకటేశ్వర్లు అసలు మొదటి భార్య చనిపోయిన తర్వాత రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్య కవిత పెళ్లి చేసుకున్న కొంతకాలం తర్వాత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సుమారు 7సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చిన రెండో కోడలు కవిత ఆమె భర్తతో కలిసి అత్త భద్రమ్మతో నిత్యం ఘర్షణకు పూనుకునే వారు ఈ క్రమంలో శుక్రవారం కవితతోపాటు ఆమె భర్త వెంకటేశ్వర్లు కలిసి భద్రతపై దాడి చేయడమే కాక ఇంట్లో ఉన్న టీవీ ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ఈ మేరకు భద్రమ్మ ఇల్లెందు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు విచారణ చేపట్టారు.

దివ్యాంగుడికి జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్



కామేపల్లి, మే31: కామేపల్లికి చెందిన పుట్టకతోనే దివ్యాంగుడు పూజాల శివక్రిష్ణకు జంతుశాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ ఇస్తారి మామిడాల పర్యేక్షణలో ఆన్ విట్రో అండ్ ఇన్ సిలికో హైపోగ్లిసెమిక్ ఎఫెక్ట్ ఆఫ్ ఫైటో కెమికల్స్ ఐసోలాటెడ్ ఫ్రామ్ ది లీవ్స్ ఆఫ్ కాస్ట్యూస్ ఇగ్నేయస్ అనే అంశంపై అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించారు.

ఆర్టీసీలో మరో రెండు లాజిస్టిక్ కేంద్రాలు ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, మే31: ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే లాజిస్టిక్ పార్శిల్స్ కేంద్రాలను మరో రెండు ప్రారంభించారు. శుక్రవారం ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఖమ్మం నగరంలోని కరణగిరి ప్రాంతంలో ఒకటి, బోనకల్ మండల కేంద్రంలో మరో కేంద్రాన్ని ప్రాంభించారు.

తాగునీరు మహాప్రభో

- కల్లూరు మండల కేంద్రంలో ప్రజల అవస్థలు
- కావాల్సింది 30 లక్షల లీటర్ల నీరు, అందుబాటులో ఉంది 10 లక్షల లీటర్లే..
- రోజువిడిచి రోజు నీటి సరఫరా, అవి కూడా అరకొరగానే...

కల్లూరు, మే31: మండల కేంద్రంలో మిషన్‌భగీరథ తాగునీరు అందక ప్రజలు అలమటిస్తున్నారు. పూర్తిస్థాయిలో నీరు అందక ఇబ్బందిపడుతున్నారు. మరో వైపున సగటున రోజు వారిగా నీటి పంపిణీలో గ్రామ పంచాయితీ వారు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా కల్లూరు పట్టణ జనాభాకు అనుగుణంగా మిషన్ భగీరథ పథకం ద్వారా 30లక్షల లీటర్ల నీరు అందాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా లోకవరం గ్రీడ్‌ప్రాజెక్టు నుంచి 10లక్షల లీటర్ల నీరు మాత్రమే అందుతున్నాయి. ఫలితంగా పట్టణ ప్రజానీకానికి మంచినీరు తగిన స్థాయిలో సరిపడని పరిస్థితి నెలకొంది. కల్లూరులో ఇప్పటికే 20 వేలకు పైగా జనాబా ఉంది. ఇక భగీరథ నీరు సరపడనంతగా అందక పోవటంతో స్థానికంగా పంచాయితీ వారు కల్లూరులోని పెద్దచెరువు నుంచి మోటర్ల ద్వారా పంపింగ్ చేస్తూ మంచి నీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రకారం నీరు అందించటంతో కొంత మేరకు తాత్కాలికంగా నీటి ఇబ్బంది లేకుండా చేస్తున్నారు. మరో వైపున భగీరథ ప్రాజెక్టు అధికారులు అందుబాటులో లేక పోవటం, కల్లూరు పట్టణానికి మంచినీటి అవసరం ఏ మేరకు ఉంది అనేది పర్యవేక్షణ చేయకపోవటంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. జిల్లాలోనే మేజర్ పంచాయితీగా నిలిచిన కల్లూరు పట్టణంలో ప్రస్తుతం అందిస్తున్న నీరు అరకొరగా అందిస్తే స్థానిక ప్రజానీకం తీవ్రమైన ఇబ్బంది పడే పరిస్థితి దాపురించింది. దీనికి తోడుగా స్థానికంగా గల మంచి నీటి పథకాల ద్వారా నీటిసరఫరా చేయటం ప్రశ్నార్థకరంగా మారింది. భగీరథ విభాగం అధికారులు మాత్రం మంచినీటి సరఫరా విషయంలో గ్రామ పంచాయితీ వారితో సమన్వయం లేకపోవటంతో నీటి సరఫరాలో సమస్య తలెత్తుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి సరి పడ తాగునీరు అందించాలని స్థానికులు చెబుతున్నారు.



కల్లూరులో అరకొరగా మంచినీరు అందిస్తున్న భగీరథ పథకం

నీటి సరఫరాలో ఇబ్బందులు పడుతున్నాం
పంచాయితీ కార్యదర్శి కృష్ణారావు



కల్లూరు పట్టణానికి భగీరథనీరు అరకొరగా అందుతున్నాయి. జనాభాకు సరిపడనంతగా నీరు 30 లక్షలు లీటర్లు అవసరం. కానీ 10 లక్షల లీటర్లు మాత్రమే అందించటంతో క్షేత్ర స్థాయిలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతానికి స్థానికంగా గల మంచినీటి వనరుల ఆధారంగా నీరు అందిస్తున్నాం. పట్టణ జనాభా సామర్థ్యానికి తగినంతగా మంచినీరు భగీరథ పథకం ద్వారా అందించాల్సిన అవసరం ఉంది.

మట్టి తవ్వకాలపై కలెక్టర్ ఆగ్రహం

- సమగ్ర నివేదిక అందించాలని అధికారులకు ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంరూరల్, మే31: ఏదులాపురం చెరువులో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలపై కలెక్టర్ గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తవ్వకాలపై రెండు రోజులుగా ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. 'అనుమతుల మాటున అక్రమ దందా.., ఆగేదే లే' అనే కథనాలు ప్రచురించారు. భారీస్థాయిలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతుంటే సంబందిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారు అని ఐబి శాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమతోలకాల పట్ల అధికారులు, కిందిస్థాయి సిబ్బంది వ్యవహారంపై సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. ఐబీ ఈఈ వెంకటేశ్వర్లు ఏదులాపురం చెరువును సందర్శించారు. అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ తవ్వకాలు నిర్వహించిన వారిని గుర్తించి నివేదిక అందజేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎట్టకేలకు మట్టి తోలకాలకు అడ్డుకట్ట పడేలా చేసిన ఆంధ్రజ్యోతిని పలువురు గ్రామస్తులు అభినందించారు. నెలరోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా చెరువుమట్టిని రియల్ వెంచర్లలోకి తరలించారు. తాజాగా వీటికి బ్రేక్ పడింది.



చెరువు తవ్వకాలను పరిశీలిస్తున్న ఈఈ

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

ఖమ్మంస్పోర్ట్స్, మే31: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నెలరోజులుగా జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈనెల 1నుంచి ప్రారంభమైన శిబిరాల్లో సుమారు 1280 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన శిబిరంలో శిక్షణలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం పోటీలు నిర్వహించారు. జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బహుమతులు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి తెలిపారు. టేబుల్ టెన్నీస్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను శుక్రవారం డీఈవో సోమశేఖర శర్మ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



శిక్షణ పూర్తి చేసుకున్న టేబుల్ టెన్నీస్ క్రీడాకారులు

ఫుట్‌బాల్ కోచింగ్ కోర్సు పూర్తి చేసుకున్న నగర క్రీడాకారులు

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి సీనియర్ క్రీడాకారులు సాయిరామ్, నోయల్ జాక్సన్ ఫుట్‌బాల్ లైసెన్స్ కోచింగ్ కోర్సు పూర్తి చేసుకున్నారని జల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ కళ్యాణపు ఆదర్శ్‌కుమార్ తెలిపారు. వారు ఈనెల 25 నుంచి 30 వరకు భువనగిరిలో ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కోర్సులో ప్రతిభా పాటవాలు ప్రదర్శించి విజయవంతంగా కోచింగ్ కోర్సు పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కోచింగ్ కోర్సు పూర్తి చేసుకున్న క్రీడాకారులను ఆయన అభినందించారు.

విధులు నిర్వహించకుండానే వేతనం

నగర పాలకసంస్థలో ఇష్టారాజ్యం

ఖమ్మంకార్పొరేషన్, మే31: విధులు నిర్వహించకుండానే ప్రతీ నెలా వేతనం పొందుతుండటం నగర పాలకసంస్థ కార్యాలయంలో చర్చాంశనీయమయింది. సంస్థలో పర్మినెంట్ ఉద్యోగం చేస్తున్న బిల్‌కలెక్టర్ సక్రమంగా విధులు నిర్వహించడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కార్యాలయంలోని జనన, మరణ ధ్రువీకరణ విభాగంలో డిప్యుటేషన్‌పై పంపారు. అక్కడ కూడా నిత్యం విధులకు హాజరు కాకపోవటంతో సదరు విభాగం ఏఎస్‌వో బిల్ కలెక్టర్ పనితీరు సరిగా లేదని, తమ విభాగంలో వద్దని తిరిగి పంపారు. దీంతో అటు బిల్‌కలెక్టర్ విధులు నిర్వహించకుండా, ఇటు జనన, మరణ ధ్రువీకరణ విభాగంలో పని చేయటం లేదు. అంతేకాక నిత్యం నగరపాలకసంస్థ కార్యాలయానికి వచ్చి బయోమెట్రిక్‌లో వేలిముద్ర వేసి, రిజిస్టర్‌లో సంతకం పెట్టి వెళుతున్నాడు. ఈ విషయం నగరపాలకసంస్థ కార్యాలయంలో బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇలా సుమారు 3 నెలలుగా విధులు నిర్వహించకుండానే వేతనం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అధికారులు సైతం పట్టించుకోకపోవటంతో సదరు బిల్‌కలెక్టర్ ఆడింది ఆటగా సాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. నగరపాలకసంస్థ కార్యాలయంలోని పారిశుధ్య విభాగంలో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగులు విధులు సరిగా నిర్వహించరనే ఆరోపణలు ఉన్నాయి. వారిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. పారిశుధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకునే అధికారులు పర్మినెంట్ ఉద్యోగుల పనితీరును పర్యవేక్షించకపోవటం విమర్శలకు దారితీస్తోంది. విధులు నిర్వహించకుండానే వేతనం పొందుతున్న పర్మినెంట్ ఉద్యోగి ఉదంతమే దీనికి నిదర్శనం. ఈ విషయమై నగర పాలకసంస్థ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్ వివరణ కోరగా బిల్‌కలెక్టర్ విధులు సరిగా నిర్వహించకపోవటంతో ప్రస్తుతం ఏ విభాగానికి కేటాయించలేదన్నారు. ప్రస్తుతం అతడిని హోల్డ్‌లో ఉంచామని, త్వరలో విభాగం కేటాయిస్తామన్నారు. అక్కడ నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఘనంగా సినీహీరో కృష్ణ జయంతి

ఖమ్మం కలెక్టరేట్, మే31: సినీ నటుడు సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ 81వ జయంతి వేడుకలను శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో ఘనంగా నిర్వహించారు. సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన ఆధ్వర్యంలో స్థానిక మాత శిశు చిన్నపిల్లల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రోగులతో కలిసి కేక్‌కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సూపర్ స్టార్ కృష్ణ మహేష్‌సేన జిల్లా గౌరవ అధ్యక్షుడు తోట రంగారావు, జిల్లా అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు, నగర అధ్యక్షుడు మునగాల బాలు, సత్తుపల్లి నుంచి కే.వెంకటేశ్వరావు, మహబూబాద్ నుంచి గౌరవ అధ్యక్షుడు ఎస్.మనోహర్, జిల్లా కన్వీనర్ బాణాల లక్ష్మణ్, నగర కన్వీనర్ పులిపాటి సంపత్‌కుమార్, నగర గౌరవాధ్యక్షుడు నాగార్జున, బ్రహ్మం, సహాయ కార్యదర్శి నల్లబెల్లి గౌతమ్, నగరకార్యదర్శి మాలోత్ రవి, సుధాకర్, నరసింహారావు, మర్రి శివ, మహేష్ చౌదరి మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు సన్మానం

తల్లాడ,మే31: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ మేనేజర్ షేక్. ఇబ్రహీంను ఖాతాదారులు శుక్రవారం సన్మానించారు. బ్రాంచ్‌లో నాలుగువేలమంది ఖాతాదారులకు బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన తల్లాడ నుంచి ఖమ్మం మెయిన్ బ్రాంచ్‌కు బదిలీపై వెళుతుండటంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ప్రముఖ వ్యాపారులు దారా విష్ణుమోహన్‌రావు, సుధా నాగేశ్వరరావు, గుబ్బా బాబూరావు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు దారా శ్రీనివాసరావు, కర్నాటి లక్ష్మారెడ్డి, పులబాల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ అంజనేయులు, దగ్గుల నారాయణరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, వెచ్చా సుధాకర్, దూపాటి భద్రరాజు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

వైరా, మే31: వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ 1996-98 బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆర్థిక, అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న తమ మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. వైరాకు చెందిన మిత్రుడు వాంకుడోతు శ్రీనివాస్ సతీమణి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న మిత్రులంతా కలిసి తమకు తోచిన రీతిలో కొంత ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. శ్రీనివాస్ సతీమణిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మిత్రులు శ్రీనివాసరావు, కొండల్‌రావు, అప్జల్, కృష్ణయ్య, శేషగిరి, రఫీ, సీతరాములు, వెంకట్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

రైతులకు జీలుగుల పంపిణీ

వేంసూరు,మే31: కేజీమల్లెల సొసైటీ పరిధిలో శుక్రవారం రైతులకు జీలుగు విత్తనాలను ఏవో రామ్మోహన్‌రావు, సొసైటీ సీఈవో చెన్నారెడ్డి పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు అన్ని సొసైటీల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదును చూసి విత్తనాలు నాటుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవోలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

- నీడ, మేత కోసం పండితాపురం సంతకు తరలింపు

కామేపల్లి,మే31: చర్ల నుంచి అక్రమంగా హైద్రాబాద్‌కు రెండు డీసీఎం వాహనాలలో తరలిస్తున్న 130పశువులను అధికారులు పట్టుకున్నారు. పక్క సమాచారం రావడంతో తిరుమలాయపాలెం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. మేత, నీటి కోసం కామేపల్లి మండలం పండితాపురం సంతలో ఉన్న షెడ్‌లకు తరలించారు. కామేపల్లి ఎంపీడీఓ రవీందర్, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ ఏర్పాట్లు చేశారు. వాటిలో ఒక ఆవు డీసీఎంలో ఒత్తిడికి గురై తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. మరో మూడు ఆవుల తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి.

పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టలేదు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయనిర్మల

తల్లాడ, మే31: తల్లాడ సొసైటీ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ పక్కదారి పట్టలేదని, బ్లాక్ మార్కెట్‌కు తరలించబడలేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయనిర్మల అన్నారు. శుక్రవారం తల్లాడ సొసైటీ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ విధానం, రిజిస్ట్రర్లను పరిశీలించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లాడ సొసైటీలో పచ్చిరొట్ట విత్తనాలైన పిల్లిపెసరను బ్లాక్ మార్కెట్‌కు తరలించారనే ప్రచారం అవాస్తవమన్నారు. వ్యవసాయశాఖ ద్వారా ఏఈవోలు ఆన్‌లైన్ చేసి జారీ చేసిన కూపన్ల ఆధారంగా పంపిణీ సక్రమంగా జరిగిందన్నారు. రైతులకు సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు ప్రతి రైతుకు అందేలా కృషిచేయాలన్నారు. ప్రతి రైతుకు తమ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం ద్వారా ఏఈవోలు ఆన్‌లైన్ చేసి సొసైటీల ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ చేయం జరుగుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు రుజువైతే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహకార సంఘం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ పాషా, సందీప్, సత్తుపల్లి ఏడీఏ నర్సింహారావు, ఏవో ఎండీ.తాజుద్దీన్, సొసైటీ సీఈవో నాగబాబు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న విజయ నిర్మల

ధరణి పెండింగ్ ఫైళ్లను పరిష్కరించాలి

టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



ఖమ్మంకలెక్టరేట్, మే31: ధరణి పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన ఛాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో ధరణి, రిజిస్ట్రేషన్ పెండింగ్‌పై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ధరణి ఫిజికల్ ఫైళ్లఆన్లైన్ నమోదు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. తహశీల్దార్లు ఫిజికల్ ధరణి ఫైళ్లను అప్లోడ్ చేస్తే, ఆర్డీవోల లాగిన్‌కు వస్తాయని, ఆర్డీవోలు పరిశీలించి అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని అన్నారు. పెండింగ్ స్లాట్ల పరిష్కారం పూర్తి చేయాలన్నారు. జూన్ 7న కలెక్టర్, ధరణి ఫిజికల్ ఫైళ్ల ఆన్లైన్, పెండింగ్ రిజిస్ట్రేషన్ స్లాట్లపై సమీక్ష నిర్వహించనున్నారని, ఆలోగా పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవిన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్ జిల్లాలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో ప్రాణాంతక వ్యాధులు

తల్లాడ, మే31: పొగాకు ఉత్పత్తులైన సిగరేట్లు, బీడీలు, చుట్టలు తాగడం, గుట్కాలు వంటివి నమలడంతో ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదముందని మండల వైద్యాధికారి రత్నమనోహర్ అన్నారు. శుక్రవారం తల్లాడలోని వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగతాగటం వల్ల ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్, క్షయవ్యాధి వంటి వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం పొగాకు ఉత్పత్తులను నివారిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కర్, హెల్త్‌సూపర్‌వైజర్ కె.పెద్దపుల్లయ్య పాల్గొన్నారు.

విరామం లేని విద్యుత్ ఉద్యోగి రఘోత్తమరెడ్డి

ఉద్యోగ విరమణ సన్మాన సభలో ఎస్ఈ సురేందర్



రఘోత్తమరెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఈ సురేందర్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే31: జిల్లాలో విరామం లేని విద్యుత్ ఉద్యోగిగా చల్లా రఘోత్తమరెడ్డి పని చేసి వివాదాలు లేకుండా పదవీ విరమణ చేయటం అభినందనీయమని విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీరింగ్ అధికారి ఏ సురేందర్ అభినందించారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన రఘోత్తమరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎస్ఈ మాట్లాడారు. కూసుమంచి, ఖమ్మం రూరల్, కొణిజర్ల, సత్తుపల్లి వంటి మండలాల్లో రఘోత్తమరెడ్డి పనిచేసి శభాష్ అనిపించుకున్నారని అభినందించారు. డీఈ టెక్నికల్ బాబురావు, డీఈ నిర్మాణ హీరాలాల్, ఏడీఈలు కిరణ్ చక్రవర్తి, సుధాకర్‌రెడ్డి, నాగమల్లేశ్వరరావు, ఏఈ ప్రసాద్, 1104 ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరి రావు, కాంట్రాక్టర్ మేడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బంక్‌వద్ద ఆందోళన

కారేపల్లి, మే31: మండల కేంద్రంలోని వెంకటసాయి పెట్రోల్ బంక్‌లో ఓ యాజమాని డిజిల్ కోసం వస్తే నీళ్లు కొట్టిన సంఘటన శక్రవారం జరిగింది. గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన కృష్ణ డిజీల్ కోసం వచ్చాడు. క్యాన్లలో డిజిల్ బదులుగా నీళ్లకొట్టంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనను దిగారు.

ఫైనాన్స్ కంపెనీల వేధింపులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,మే31: ఫైనాన్స్ కంపెనీల వేధింపులతో ప్రజలు తీవ్రంగా మానసిక క్షోభకు గురవుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మం ఏసీపీకి వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, ఎంఏ జబ్బార్, ఎస్ నవీన్‌రెడ్డి, భూక్య శ్రీనివాస్, బోడపట్ల సుదర్శన్, బత్తిని ఉపేందర్, మనోహర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాలల నిర్వహణ

ఖమ్మంసంక్షేమవిభాగం,మే31:ప్రభుత్వ అనుమతి లేకుండా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవోను కలిసి వినతిపత్రం అందించారు. ప్రముఖ ప్రైవేట్ పాఠశాలలు విద్యాను వ్యాపారంగా మార్చాయన్నారు. నాయకులు మధు, శివ, అయ్యప్ప, నరేశ్, గోపీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖమ్మంసంక్షేమవిభాగం, మే31: ఖమ్మం నగరంలోని 25వ డివిజన్ పాకబండ బజార్‌లో నివాసం ఉంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఉదారు రంగమ్మ(83) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు పరామర్శించారు. డివిజన్ అధ్యక్షుడు దాసరి పూర్ణ, నాయకులు బండారు శ్రీనివాస్, చల్లా మోహన్‌రావు, బార్లగూడెం మాజీ సర్పంచ్ పాండు, వెంకన్న, బోడ్డు మధు పాల్గొన్నారు.

కారుణ్య కుటుంబ సభ్యులకు సీపీఎం నాయకుల పరామర్శ

కొణిజర్ల, మే31: మండల పరిధిలోని సిద్దిక్‌నగర్ గ్రామానికి చెందిన కారుణ్య ఇటీవల భద్రాచలంలో నర్సింగ్ కళాశాలలో మృతి చెందటం తెలిసిందే.. కాగా శుక్రవారం దశదిన కార్యక్రమం నిర్వహించటంతో సీపీఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కాటయ్య, జయకుమార్, కృష్ణ, మోహన్‌రావు, కరుణ, స్వతంత్రరావు, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వామపక్షనేతకు పోతినేని, నున్నా నివాళి

కొణిజర్ల,మే31:మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన వామపక్షనేత ప్రస్తుత బీఆర్ఎస్ నాయకుడు కంకణాల వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. మరణవార్త తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఇతర పార్టీల నాయకులు నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఫిట్‌నెస్‌లేని ప్రైవేట్ పాఠశాల బస్సులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, మే31: ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాలల బస్సులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వంగూరి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా రవాణాశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. నాయకులు తిప్పారపు లక్ష్మణ్, కరుణ్, స్టాలిన్, వినయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల పంపిణీ



వైరా,మే31: వైరా గ్రేట్ విజన్‌క్లబ్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో డాక్టర్ కాపా చంద్రకళ జన్మదినాన్ని పురస్కరించుకొని ఇద్దరు బీటెక్ విద్యార్థులకు రాయితీపై శుక్రవారం ల్యాప్‌టాప్‌లు అందజేశారు. చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని లక్కిరెడ్డి అనూషకు, వైరాకు చెందిన బీటెక్ విద్యార్థి అంకం శ్రీకాంత్‌కు ఈ ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అలాగే లయన్ కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకున్న 25మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్ కాపా చంద్రకళ, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు వరలక్ష్మీ, శ్యాంబాబు, పెనుగొండ ఉపేంద్రరావు, లగడపాటి ప్రభాకర్, చింతలపూడి వెంకటేశ్వరరావు, అబ్బూరి రమేష్, మరికంటి రామ్‌గోపాల్, రాయపూడి వెంకటేష్, చెరుకూరి శ్రీనివాసరావు, జ్వాలా పుల్లారావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్ పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ అభినందనీయం



సత్తుపల్లి, మే31:సత్తుపల్లి లయన్ బుడోకాన్ కరాటే హెల్త్ క్లబ్ వ్యవస్థాపకుడు, జాతీయ రిఫరీ మాస్టర్ పిచ్చయ్య వేసవిలో విద్యార్థులకు ఉచితంగా కరాటేలో శిక్షణ ఇవ్వటం అభినందనీయమని 15వబెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు అన్నారు. ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో రాణించటం హర్షనీయమన్నారు. కరాటేతో శారీరక దారుఢ్యం, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. మూడు దశాబ్దాలుగా వేసవిలో ఉచిత కరాటే శిక్షణ ఇస్తున్న పిచ్చయ్యను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, సలీం, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.